క్లుప్తంగా

రామాంజనేయులు మృతి తీరనిలోటు



రామాంజనేయులు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మెట్టు

బొమ్మనహాళ్: బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామాంజనేయులు (48) మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఉదయం రామాంజనేయులు అనారోగ్యంతో మృతి చెందాడు. మెట్టు గోవిందరెడ్డి, మండల కన్వీనర్ వన్నల్లి రామాంజనేయులు, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, పయ్యావుల సత్యన్న, సర్పంచ్ గాదిలింగ, పరమేశ్వర, వీరన్నగౌడ్, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్, బసవరాజు, వంశీ, వెంకటేష్‌లు హాజరై రామాంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి



తత్రకల్లులో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి అధికారి ఎం.వెంకటేశ్వరి అన్నారు. శనివారం మండల పరిధిలోని తత్రకల్లులోని కేజీబీవీలో స్పెషలాఫీసర్ ధనలక్ష్మి అధ్యక్షతన బాలల హక్కులు – చట్టాలు, బాల్యవివాహాలతో జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలికలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. సూపర్‌వైజర్ పద్మావతి, డీటీ చంద్రశేఖర్, ఓసీబీ శాంతమణి, హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ నాగశంకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బదిలీ

గుమ్మఘట్ట: స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నమయ్య జిల్లా నందలూరుకు బదిలీ అయ్యారు. ఎన్నికల సమయంలో బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు.

బాల్యవివాహాలతో జీవితాలు బుగ్గి



మాట్లాడుతున్న సీడీపీఓ వనజా అక్కమ్మ

కుందుర్పి: బాల్య వివాహాలు చేసి చిన్న వయసులోనే బాలికల జీవితాలు బుగ్గిపాలు చేయొద్దని సీడీపీఓ వనజా అక్కమ్మ అన్నారు. శనివారం మండలంలోని తెనగల్లు గ్రామంలో బాల్య వివాహాలు చేస్తే జరిగే అనర్థాలపై చైతన్య కార్యక్రమం నిర్వహించారు. కర్ణాటక సరిహద్దు గ్రామాల పరిధిలో ఎక్కువగా బాల్య వివాహాలు చేస్తూ అనర్థాలను కొని తెచ్చుకొంటున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మీ, ఆర్డీటీ ప్రతినిధి ఆదినారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, బాలికలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

బెళుగుప్ప: కాలువపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం కొవ్వూరు నగర్‌కు చెందిన హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. హరికృష్ణ తలకు తీవ్ర గాయమైంది. అతన్ని అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించారు. హరికృష్ణ భార్య భారతి పోలీసులకు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

అక్రమ లేఔట్ల తొలగింపు

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో వెలిసిన అక్రమ లేఔట్లను రెవెన్యూ అధికారులు శనివారం తొలిగించారు. సర్వేనంబర్ 33లో రెండు ఎకరాలు, సర్వేనబర్‌లో 20 –70 సెంట్లు, సర్వే నంబర్‌లో 7లో 40 సెంట్లు భూమిని ప్లాట్లు వేసి, విక్రయిస్తున్న విషయం తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి దృష్టికి వచ్చింది. స్థానిక వీఆర్‌ఓ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది అక్రమ లేఔట్లను తొలించారు.

సంజప్పతాత బ్రహ్మరథోత్సవం



సంజప్పతాత రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మోపిడి గ్రామంలో వెలసిన సంజప్పతాత బ్రహ్మరథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామి మడుగుతేరును ఆలయం నుంచి కొంత దూరం వరకు లాగారు. అనంతరం వందలాది మంది భక్తుల నడుమ ధూళోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామి జీవ సమాధి వద్ద విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వామ్మో.. ఆయనైతే వద్దు

- తహసీల్దార్ లేక గాడితప్పుతున్న రెవెన్యూపాలన
- పరిష్కారం కాని ప్రజా సమస్యలు

రాయదుర్గం: రాయదుర్గం మండలానికి తహసీల్దార్‌గా అలెగ్జాండర్‌ను నియమించారు. అయితే ఈ తహసీల్దార్ మాకొద్దు బాబోయ్..అధికార పార్టీ నాయకులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇటీవల తహసీల్దార్లకు స్థాన చలనం కలిగింది. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆయా మండలాలకు తహసీల్దార్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాయదుర్గం తహసీల్దార్‌గా అలెగ్జాండర్‌ను నియమించారు. ఈయన తాడిపత్రి, యాడికి తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. పనిచేసిన ప్రతిచోటా నిక్కచ్చిగా, అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేశారు. రాజకీయ సిఫార్సులకు ప్రాధాన్యత ఎక్కడా ఇవ్వలేదు. ఇలాంటి అధికారి వస్తే తమ ఆటలు సాగవని కూటమి నేతలు కొందరు తహసీల్దార్ బాధ్యతలు తీసుకోకుండా అడ్డుపుల్ల వేసినట్లు తెలిసింది.

స్తంభించిన రెవెన్యూ సేవలు..

తహసీల్దార్ లేకపోవడంతో రెవెన్యూ సేవలు నిలిచిపోయాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు నిరుత్సాహంతో వెనుతిరుగుతున్నారు. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికీ ఇవ్వకపోవడంతో మీ–సేవ, ఏపీ–సేవ, కులం, ఆదాయం, పుట్టినతేదీ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రాలు, భూమార్పిడి, మ్యుటేషన్, కరెక్షన్, అండగల్ ట్రాన్సెక్షన్, ఆధార్ తదితర అత్యవసర సేవలన్నీ స్తంభించిపోయాయి. కీలక దస్త్రాలన్నీ తహసీల్దార్ టేబుల్‌పైనే ఆగిపోయాయి.

పెరుగుతున్న భూ కబ్జాలు :

ఇటీవల కాలంలో రాయదుర్గం పట్టణంలోని బీటీపీ, గౌడ, మల్లాపురం లేఔట్లలో భూ కబ్జాలు విపరీతంగా పెరిగాయి. వాటికి అడ్డుకట్టు వేయలేక రెవెన్యూ సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. తహసీల్దార్ లేకపోవడంతో సిబ్బంది ముందుకు అడుగేయలేక పోతున్నారు. దీంతో అక్రమార్కులకు ఆడిందే ఆటగా అయ్యింది.

నాగరాజైతే ఓకే..

2014–19లో టీడీపీ అధికారంలో ఉండగా రాయదుర్గం తహసీల్దార్‌గా నాగరాజు పనిచేశారు. అందరితోనూ కలుపుగోలుగా మెలిగేవారని ముద్ర ఉంది. అలెగ్జాండర్ స్థానంలో నాగరాజైతే మేలని కూటమి నేతలు అనుకుంటున్నారు. అయితే ఆయన సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్నారు. తాజా బదిలీల్లో అక్కడి కలెక్టర్ కొత్తచెరువుకు పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ విధుల్లో చేరలేదని తెలిసింది. అంతర్ జిల్లాల బదిలీలు జరగాలంటే సీసీఎల్‌ఆర్ నుంచి ఉత్తర్వులు వెలువడాలి. దీనికి తోడు సత్యసాయి జిల్లాలో తహసీల్దార్ల కొరత ఉండడంతో అక్కడి కలెక్టర్ ఎవరినీ రిలీవ్ చేసేట్టులేదని తెలిసింది.



తహసీల్దార్ కార్యాలయం

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



రాయదుర్గం తహసీల్దార్‌గా అలెగ్జాండర్‌ను జిల్లా కలెక్టర్ నియమించారు. రికార్డులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం అతను విధుల్లో చేరలేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. తహసీల్దార్ నియామకం అంశం సోమవారం తేలిపోతుంది. మరో తహసీల్దార్‌ను నియమించే అవకాశం ఉంది. ఆలస్యమైతే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి అయినా సమస్యకు పరిష్కారం చూపుతాం.

– రాణీసుస్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

దేశంలో వైద్యులకు రక్షణ కరువు



కుందుర్పిలో వైద్యుల నిరసన



శ్రీధరఘట్టలో ర్యాలీ చేస్తున్న వైద్యసిబ్బంది



ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

ఉరవకొండ: దేశంలో వైద్యులకు రక్షణ కరువైందని ఉరవకొండ గైనిక్ వైద్యులు సాక్షి, సాహితి, వినీత, కుముద అన్నారు. శనివారం కోల్‌కతాలో వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన తెలియజేశారు. నల్లబ్యాడ్జిలు ధరించి ర్యాలీ చేశారు. వైద్యులు గంగాధర్, అర్జున్, తాలుకా ఏపీ హంస కార్యదర్శి నిమ్మల వెంకటేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: కొలకత్తా ఘటనలో హత్యకు గురైన వైద్య విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగేలా నిందితులను ఉరిశిక్ష విధించాలని ఎంఎంపీల అసోసియేషన్ డిమాండ్ చేసింది. వైద్య విద్యార్థి హత్య సభ్య సమాజానికి సిగ్గు చేటని పేర్కొంటూ శనివారం రాయదుర్గం పట్టణం, రూరల్ పరిధిలోని ఆర్‌ఎంపీలు తమ సేవలను 24 గంటల పాటు బహిష్కరించి, నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మల్లికార్జున, సురేష్, రఘు, చాంద్‌బాషా, బీజీ స్వామి, అబూబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా..?

రాయదుర్గంటౌన్: ప్రాణాలు కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే ఎలా? అని రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి మాధవి, సర్జన్ మెర్సీ జ్ఞానసుధ, చిన్నపిల్లల వైద్యనిపుణుడు ఉమామహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించి, నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్ సాయి, నర్సులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రాయదుర్గంటౌన్: కోలకత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సీపీఐ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలియజేశారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గురుస్వామి, తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించండి

బొమ్మనహాళ్: కోల్‌కత్తా ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ ఆస్పత్రిల్లోని వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. , శ్రీధరఘట్ట, బొమ్మనహాళ్ పీహెచ్‌సీల వైద్యాధికారిణులు గీతాభార్గవి, మల్లీశ్వరి, శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. తహసీల్దార్ మునివేలు, పోలీస్ స్టేషన్‌లో శనివారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట ప్రధాన రహదారిపై వైద్యులు, వైద్యసిబ్బంది శనివారం ర్యాలీ చేశారు. కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం , హత్య ఘటనలో దోషులను శిక్షించాలని పీహెచ్‌సీ వైద్యులు రమేష్, సందేశ్ కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు అనూష, ఫరీదాబాను, హేమలత, చాందిని, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించండి

కణేకల్లు: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని డాక్టర్లు నిరీషా, పావని, చంద్రమనోహర్, చంద్రశేఖర్‌నాక్ డిమాండ్ చేశారు. కణేకల్లు సీహెచ్‌సీ, గరుడచేడు పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది నిరసన ర్యాలీ చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సిబ్బంది శనివారం ర్యాలీ చేశారు. అనంతరం రాష్ట్ర ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది టీసర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నవీన్, పట్టణ అధ్యక్షుడు హర్షవర్ధన్, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని వైద్యాధికారులు, సిబ్బంది శనివారం ర్యాలీ చేశారు. కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచార, హత్య ఘటనను నిరసిస్తూ ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక,లోకేష్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, విజయ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కళ్యాణదుర్గం టీసర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసిన వైద్యసిబ్బంది



బెళుగుప్పలో మానవహారం ఏర్పాటు చేసిన వైద్యులు, సిబ్బంది



కణేకల్లులో నిరసన చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

కిక్కిరిసిన నేమకల్లు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బొమ్మనహాళ్: నేమకల్లు ఆలయంలో శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష తులసీమాల అలంకరణలో ఆంజనేయస్వామి దర్శనమిచ్చారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

కూడేరు: కూడేరు, బసాపురం, రామదుర్గం ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఆంజనేయుడి నామస్మరణ మార్మోగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆంజనేయ స్వామి మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. బసాపురంలో పల్లకీ ఉత్సవం చేశారు.

జిహ్వేశ్వరస్వామి జయంతి



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రాయదుర్గంటౌన్: స్వకులసాలి సమాజ బాంధవుల మూలపురుషుడైన శ్రీజిహ్వేశ్వరస్వామి జయంతి ఉత్సవాన్ని పట్టణంలోని శ్రీహటకేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా జిహ్వేశ్వర స్వామి భావచిత్రపటాన్ని వెండిరథంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఊరేగింపు బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, ఓబుళాచారీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఉదయం స్వామికి రుద్రాభిషేకం, నామకరణోత్సవం, స్వామి వారి సంక్షిప్త చరిత్ర పఠనం గావించారు. స్వకులసాలి సమాజం(చేనేత), విద్యావర్ధక సంఘం, యువజన సంఘం, జరాజేశ్వరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం

బెళుగుప్ప: జిల్లా కేంద్రంలోని రాకేష్ వృద్ధాశ్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం అన్నదానం చేశారు. ఎంపీపీ తన భార్య చిలబండ్ల నాగరత్నమ్మ మూడో వర్ధంతి సందర్భంగా కుమారుడు సాయి కుమార్, కోడలు సంధ్యారాణి, కూతుర్లు శిరీష, సుష్మాలతో కలిసి అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పూసల రుద్రప్ప కుమారుడు శ్రీకాంత్ (38) గుండెపోటుతో శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య గౌతమి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

క్రమశిక్షణతో కూడిన బోధన అవసరం

కూడేరు: విద్యార్థులకు క్రమశిక్షణతో బోధన చేయాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'కాంప్లెక్స్ మీటింగ్' జరిగింది. ఎంఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఆదిలక్ష్మీ, రమణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతలకు ప్రత్యేక పూజలు

కూడేరు: శ్రావణ మాస రెండో శనివారాన్ని పురస్కరించుకొని నాగదేవతలకు కూడేరు, ముద్దలాపురం, కమ్మూరు, ఇప్పేరు, కడదరకుంట, కొర్రకోడు, అంతరగంగతో పాటు మరికొన్ని గ్రామాల్లో ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. పుట్టలకు పాలు పోసి, మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి పల్లకీ ఉత్సవం



పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీసమేత స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ఆకు పూజ, నైవేద్య పూజలు జరిపించారు. అనంతరం పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

లారీ బోల్తా.. ఇద్దరికి గాయాలు

శెట్టూరు: మండలంలో శెట్టూరు నుంచి కర్ణాటక సరిహద్దున ఉండే పాతప్పగుడి ప్రధాన రోడ్డుపై లారీ శనివారం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంతో డ్రైవర్ రాజు, క్లీనర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వీరిని స్థానికులు కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు.

రహదారిపై వర్షపునీరు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో అనంతపురం ప్రధాన రహదారిపై సాయిబాబా గుడి వద్ద శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి నీటికుంటను తలపించింది. వర్షం నీరు పోవటానికి వీలులేకపోవడంతో నీరంతా నిలిచిపోయింది.

ఇళ్ల వద్దకు వెళ్లి ఫిజియోథెరపీ

కూడేరు: సమగ్ర శిక్ష సహిత విద్య ఆధ్వర్యంలో భవిత కేంద్రం ఐఈఆర్టీలు మస్తానయ్య, లక్ష్మీనారాయణలు పి.నారాయణపురంలో ప్రత్యేక అవసరాల గల పిల్లల ఇంటికి వెళ్లి ఫిజియోథెరపీ చేయించారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలుగల పిల్లలు అరవకూరు, పి.నారాయణపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో 10 మంది ఉన్నారన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంస




అవార్డు అందుకుంటున్న ఎస్‌ఐ ఆంజనేయులు

కంబదూరు: మండలానికి చెందిన అధికారులు ఉత్తమ సేవకులుగా అవార్డులు అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా వీరు అవార్డులు అందుకున్నారు. ఎస్‌ఐ ఆంజనేయులు, ఐసీడీఎస్ బ్లాక్ కోఆర్డినేటర్ ముత్యాలురెడ్డి ఉత్తమ సేవలకుగాను అవార్డులు అందుకున్నారు. శనివారం స్థానిక అధికారులు, సిబ్బంది, నాయకులు వీరిని అభినందించారు.




అవార్డు అందుకుంటున్న ముత్యాలరెడ్డి

ఏకధాటిగా వర్షం



పీఏబీఆర్ లింక్ ఛానల్ వద్ద వరదనీటి ఉధృతి



భారీ వర్షానికి పారుతున్న బూదగవి చెరువు మరువ



జెక్కిరెడ్డిపల్లిలో నీట మునిగిన టమాట పంట



ముప్పలకుంట వద్ద వర్షపు నీటితో నిండుగా కనిపిస్తున్న చెక్ డ్యాం

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- మరువ పారిన బూదగవి చెరువు
- హెచ్చెల్సీలో వరద నీటి ఉధృతితో పెరిగిన ప్రవాహం
- ఇళ్లలోకి వర్షపునీరు చేరి ప్రజల అవస్థలు

ఉరవకొండ: నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో ఉరవకొండలోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపునీరు చేరింది. బూదగవి చెరువు మరువ పారింది. మోపిడి వద్ద ఉన్న పీఏబీఆర్ లింక్ ఛానల్ వద్ద వరద నీటి ఉధృతికి హెచ్చెల్సీ కాలువ నిండు కుండలా మారింది. లింక్ ఛానల్ వద్ద ఎంపీఆర్‌కు వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. ఉరవకొండలోని శివరామిరెడ్డి కాలనీ, పాతపేట, చిన్నకొండ వద్ద, ఇందిరానగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరి, ప్రజలు అవస్థలు పడ్డారు. రాకెట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీ భారీ వర్షానికి కూలిపోయింది. ఉరవకొండలో 65.8 మిమి, వజ్రకరూరులో 64.4 మిమి, విడపనకల్లులో 47.4 మి.మీ, కూడేరులో 26.8 మిమీ, బెళుగుప్పలో 17.8 మిమి వర్షపాతం నమోదయ్యింది.

భారీ వర్షంతో దెబ్బతిన్న పంటలు

కంబదూరు: మండలంలో వర్షం దంచి కొట్టింది. శుక్రవారం సాయంత్రం నుంచి తెల్లవారు జామువరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని చెక్‌డ్యాంలు, వాగులు, వంకలు కూడా పొంగిపొర్లాయి. కంబదూరు చెరువులోకి వర్షం నీరు చేరింది. భారీ వర్షానికి మర్రిమాకులపల్లి, పాళ్లూరు, రాంపురం, జెక్కిరెడ్డిపల్లి, అండేపల్లి గ్రామాల్లో సాగు చేసిన టమాట పంట నీట మునిగింది. తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయారు. నీట మునిగిన పంటను ఉద్యాన అధికారి గౌసియా పరిశీలించారు.

కూడేరు: మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం వేకువజాము వరకు భారీ వర్షం కురిసింది. 25 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పెనకలపాడు, సొల్లాపురం, మాల్యం, రచ్చుమర్రి, కణేకల్లు క్రాస్, నల్లంపల్లి, యర్రగుంట, పుల్లంపల్లి గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. సొల్లాపురం–పెనకలపాడు మార్గమధ్యంలో ఉన్న వంకకు భారీగా వరదనీరు రావడంతో శనివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లో వాగులు , వంకలు పొంగి పొర్లాయి. భైరసముద్రం, బ్రహ్మసముద్రం, సంతే కొండాపురం, పడమటి కోడిపల్లి తదితర గ్రామాల్లోని చెరువులకు నీరు చేరాయి. ముప్పలకుంట ఆర్డీటీ చెక్ డ్యాం పొంగిపొర్లుతోంది. సూగేపల్లి గ్రామంలో వర్షం నీటి ప్రవాహానికి కల్వర్టు కోతకు గురైంది.

బొమ్మనహాళ్‌లో భారీ వర్షం

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి వర్షం దంచికొట్టింది. ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, ఉంతకల్లు, దేవగిరి, బండూరు, కొలగానహాళ్లి, కల్లుదేవనహాళ్లి, ఎల్‌బీ నగర్, ఉప్పరహాళ్, కృష్ణాపురం, లింగదహాళ్, నేమకల్లు తదితర గ్రామాల్లో ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో 40.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి కొలగానహాళ్లి వద్ద కబ్బాల్ వంక, కందేపల్లి వద్ద వేదావతి, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది.



కళ్యాణదుర్గంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



పెనకలపాడు వద్ద వంకలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు